# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 05-10-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ మహారాష్ట్ర పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈరోజు వివిధ అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు.
- ❖ ఈశాన్య రాష్ట్రాలు దేశానికి ఆత్మ అని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ అన్నారు.
- ❖ షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సమావేశాల్లో భాగంగా పాకిస్థాన్‌తో భారత్ ఎటువంటి చర్చలు జరపదని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జయశంకర్ స్పష్టం చేశారు.
- ❖ హర్యానా అసెంబ్లి ఎన్నికల పోలింగ్ లో ఈరోజు సాయంత్రం 5 గంటల వరకు 61 శాతం ఓటింగ్ నమోదైందని అధికారులు వెల్లడించారు.
- ❖ జూనియర్ ప్రపంచ ఛాంపియన్ షిప్‌లో భారత క్రీడాకారులు మరో రెండు స్వర్ణ పతకాలు గెలుచుకున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

మహారాష్ట్ర పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈరోజు వివిధ అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. ఈ సందర్భంగా థానే నగరంలో ఏర్పాటు చేసిన సభలో నరేంద్ర మోదీ ప్రసంగిస్తూ... "వికసిత్ భారత్" లక్ష్యాలను చేరుకోవడానికి ముంబై, థానే వంటి నగరాలు భవిష్యత్తుకు సిద్ధంగా ఉండాలని అన్నారు. అటల్ సేతు, ముంబై మెట్రో, కోస్టల్ రోడ్‌తో సహా ముంబై మెట్రోపాలిటన్ రీజియన్‌లోని వివిధ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను ఆయన ప్రస్తావించారు. ఈ ప్రాజెక్టులు ప్రజల జీవితాలను సులభతరం చేయడమే కాకుండా నూతన ఉపాధి అవకాశాలను సృష్టిస్తాయని ప్రధానమంత్రి పేర్కొంటూ....

(వాయిస్ 36 సెకన్లు)

అంతకుముందు 23 వేల 300 కోట్ల రూపాయల విలువైన వ్యవసాయ, పశుసంవర్ధక రంగాలకు సంబంధించిన వివిధ కార్యక్రమాలను మహారాష్ట్రలోని వాషిమ్‌లో ప్రారంభించారు. అలాగే 20 వేల కోట్ల రూపాయల విలువైన “పి.ఎం.కిషాన్ సమ్మాన్” నిధి యొక్క 18వ విడత నగదును దాదాపు 9.4 కోట్ల మంది రైతులకు నరేంద్ర మోదీ విడుదల చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

ఈశాన్య రాష్ట్రాలు దేశానికి ఆత్మ అని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ అన్నారు. ఈశాన్య ప్రాంతం కేవలం భౌగోళిక ప్రాంతం మాత్రమే కాదని భారతదేశ సారాన్ని ప్రతిబింబించే సంస్కృతులు, సంప్రదాయాలు, ప్రకృతి సౌందర్యంతో కూడిన శక్తివంతమైన సమ్మేళనం అని ఈరోజు ఆయన న్యూఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో ఉద్ఘాటించారు. ఇటీవల అస్సామీ భాషను శాస్త్రీయ భాషలలో ఒకటిగా గుర్తించడాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. ఈ హోదా దేశం యొక్క గొప్ప సాంస్కృతిక వారసత్వం, వైవిధ్యాన్ని ప్రదర్శిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈశాన్య రాష్ట్రాల పర్యాటకం, అభివృద్ధిలో పాత్రికేయులు ప్రచారకర్తలుగా ఉండాలని ఉపరాష్ట్రపతి కోరారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

భారత విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ అక్టోబర్ 15-16 తేదీల్లో పాకిస్తాన్ లోని ఇస్లామాబాద్ నగరంలో జరగనున్న షాంఘై సహకార సంస్థ (SCO) శిఖరాగ్ర సమావేశాల్లో పాల్గొంటారు. ఈ సమావేశాల నేపథ్యంలో పాకిస్థాన్ తో ఎటువంటి ద్వైపాక్షిక చర్చలు భారత్ జరపబోదని జైశంకర్ స్పష్టం చేశారు. ఈరోజు న్యూఢిల్లీలో “ఐసీ సెంటర్ ఫర్ గవర్నెన్స్” నిర్వహించిన సర్దార్ పటేల్ ఉపన్యాసానికి హాజరైన ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... ఈ కార్యక్రమంలో బహుళపక్ష ప్రయోజనాల దృష్ట్యా మాత్రమే SCO సదస్సులో పాల్గొంటానని ఆయన ఉద్ఘాటించారు. ఇటీవలి కాలంలో సమావేశాలు జరగకపోవడం వల్లే సార్క్ పురోగతి సాధించడం లేదని జైశంకర్ పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

అమెరికా, బ్రిటిష్ సైనిక దళాలు సంయుక్తంగా యెమెన్‌లోని 12కు పైగా హౌతీ - నియంత్రిత స్థావరాలపై దాడులు ప్రారంభించాయి. ఐదు కీలక ప్రాంతాలలోని హౌతీ స్థావరాలను లక్ష్యంగా చేసుకొని సైనిక విమానాలు, నౌకల ద్వారా దాడులు చేస్తున్నాయి. ఆయుధ వ్యవస్థలు, సైనిక స్థావరాలు, ఇరాన్ - మద్దతుగల సాయుధ సమూహం ఉపయోగించే ఇతర మౌలిక సదుపాయాలను ఈ కీలక ప్రాంతాల్లో సమకూర్చుకొని హౌతీ దళాలు 2014 నుండి సుదీర్ఘమైన అంతర్యుద్ధంలో నిమగ్నమై ఉన్నాయని అమెరికా సైనిక అధికారులు తెలియజేశారు. యెమెన్‌లో కొనసాగుతున్న సంఘర్షణల నేపథ్యంలో ఈ దాడులు మరింత ఆందోళనను కలిగిస్తున్నాయి.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = =

హర్యానా అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఈరోజు ప్రారంభమయ్యింది. ఒకే విడతలో ఆ రాష్ట్రంలోని మొత్తం 90 శాసన సభ నియోజకవర్గాలకు పోలింగ్ నిర్వహించారు. సాయంత్రం 5 గంటల వరకు 61 శాతం ఓటింగ్ నమోదైందని అధికారులు వెల్లడించారు. 2 కోట్ల 3 లక్షల మంది ఓటర్లు 1,031 మంది అభ్యర్థుల భవితవ్యాన్ని నిర్ణయించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా 20 వేల 632 పోలింగ్ కేంద్రాలను ఎన్నికల అధికారులు ఏర్పాటు చేశారు. నిష్పక్షపాతంగా, సజావుగా ఓటింగ్ జరిగేలా అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద వెబ్‌కాస్టింగ్ సౌకర్యంతో పాటు తగిన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి పంకజ్ అగర్వాల్ తెలియజేశారు. కాగా ఈ అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ అక్టోబర్ 8వ తేదీన జరగనుంది.

= = = = = = = = = = = = = = = = = = = = =

ఝార్ఖండ్‌లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల కోసం భారతీయ జనతా పార్టీ 5 కీలక అంశాలతో కూడిన మేనిఫెస్టోను దశల వారీగా విడుదల చేస్తామని ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల కో-ఇన్‌ఛార్జి, అస్సాం ముఖ్యమంత్రి హిమంత్ బిశ్వ శర్మ తెలిపారు. ఈరోజు ఆయన రాంచీలో పాత్రికేయులతో మాట్లాడుతూ... ఝార్ఖండ్ రాష్ట్రం ఏర్పడి 25 సంవత్సరాలు పూర్తవుతున్న నేపథ్యంలో పార్టీ 25 పాయింట్ల మేనిఫెస్టోను విడుదల చేస్తుందని హిమంత్ బిశ్వ శర్మ తెలియజేశారు. కాగా 81 మంది సభ్యులున్న ఝార్ఖండ్ అసెంబ్లీకి రానున్న డిసెంబర్ లో ఎన్నికలు జరగనున్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = = =

“డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్” (DRDO) రాజస్థాన్‌లోని పోఖ్రాన్ ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్‌లో 4th జనరేషన్ వెరీ షార్ట్ రేంజ్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ యొక్క మూడు విమాన పరీక్షలను విజయవంతంగా నిర్వహించింది. గత రెండు రోజులగా నిర్వహించిన ఈ పరీక్షలు, గరిష్ట ఎత్తులో అంతరాయానికి సంబంధించిన హై-స్పీడ్ లక్ష్యాలను ఎదుర్కోవడానికి  నిర్వహించబడ్డాయి. విజయవంతమైన ఈ పరీక్షల్లో పాల్గొన్న DRDO, సాయుధ దళాలను రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అభినందించారు. ఆధునిక సాంకేతికతలతో కూడిన ఈ కొత్త క్షిపణి వైమానిక ముప్పులకు వ్యతిరేకంగా సాయుధ దళాలకు మరింత సాంకేతిక ప్రోత్సాహాన్ని ఇస్తుందని ఆయన పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

పెరూలో జరుగుతున్న ISSF జూనియర్ ప్రపంచ ఛాంపియన్ షిప్‌లో భారత క్రీడాకారుల విజయ పరంపర కొనసాగుతోంది. పిస్టల్ షూటర్ దివాన్షి మహిళల 25 మీటర్ల స్టాండర్డ్ పిస్టల్ ఈవెంట్ మరో స్వర్ణ పతకాన్ని సాధించింది. పురుషుల ఈవెంట్‌లో, స్టాండర్డ్ పిస్టల్‌లో విభాగంలో సూరజ్ శర్మ కూడా స్వర్ణ పతకం గెలుచుకున్నాడు. ఇప్పటికే 4 బంగారు పతకాలను సాధించిన ముఖేష్ నెలవల్లి ఈ విభాగంలో కాంస్య పతకం  సాధించాడు. కాగా 13 స్వర్ణాలు, 2 రజతాలు, 6 కాంస్యాలతో కలిపి మొత్తం 21 పతకాలతో భారత్ పతకాల పట్టికలో అగ్రస్థానంలో కొనసాగుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = = =

లెబనాన్ లోని ట్రిపోలీ నగరాన్ని లక్ష్యంగా చేసుకుని ఈరోజు ఇజ్రాయెల్ దాడి చేసింది. ఇజ్రాయెల్ దళాలు దక్షిణ లెబనాన్‌లో కొత్త భూదాడులను నిర్వహించడానికి ప్రయత్నిస్తున్నందున బేరుట్ శివార్లలో పెరుగుతున్న ఆందోళనల మధ్య పరిస్థితి తీవ్రతరం అవుతూనే ఉంది. ఇజ్రాయెల్-లెబనాన్ సరిహద్దు దాటి కార్యకలాపాలను విస్తరిస్తోంది. బేరుట్‌లోని హిజ్బుల్లా బలగాలను ఇజ్రాయెల్ లక్ష్యంగా చేసుకుంది. ఇజ్రాయెల్ హిజ్బుల్లా యొక్క ఇంటెలిజెన్స్ ప్రధాన కార్యాలయాన్ని చేరుకున్నామని ప్రకటించింది. ఈ ఘర్షణల కారణంగా 12 లక్షలకు పైగా ప్రజలు నిరాశ్రయులయ్యారని లెబనాన్ ప్రభుత్వం వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = =

ఛత్తీస్‌గఢ్‌లో నిన్న జరిగిన ఎన్‌కౌంటర్ సంఘటనా స్థలం నుంచి మరో ముగ్గురు మావోయిస్టుల మృతదేహాలను పోలీసులు ఈరోజు స్వాధీనం చేసుకున్నారు. దీంతో అబుజ్‌మద్ ప్రాంతంలో భద్రతా బలగాలతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టుల సంఖ్య 31కి చేరుకుంది. నారాయణపూర్, దంతేవాడ జిల్లా సరిహద్దులోని నెందుర్ - తుల్తులి అటవీ ప్రాంతంలో నిన్న ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారని నిఘా వర్గాల సమాచారం మేరకు జిల్లా రిజర్వ్ గార్డ్, స్పెషల్ టాస్క్ ఫోర్స్ ఆ ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = =